## మినీకథ




రాజభవనంలో రాకుమార్తెను పెండ్లాడడానికి వచ్చిన రాకుమారుల్లా బారులుతీరి వరండాలో కూర్చుని వున్నారు ఇంటర్వ్యూకొచ్చిన నిరుద్యోగులంతా. అక్కడ ఖాళీ వుంది ఒక్క అటెండర్ పోస్టు. ఆ ఒక్క ఖాళీకి ఎం.ఎ.లు, బి.ఎ.లు వచ్చి వరుసలో కూర్చుని వున్నారు. ఆ కూర్చుని వున్నవాళ్ళలో ఒకడు సత్యం. బి.ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు. పాసయ్యి పదేళ్ళు కావస్తున్నా ఉద్యోగానికి నోచుకోలేదు. ఇంటి దగ్గర కుటుంబ పరిస్థితి బాగాలేదు. ఎలాగైనా ఈ అటెండరు పోస్ట్ వస్తే తనపై ఆధారపడి జీవిస్తున్న రోగిష్టి తల్లి, వయసొచ్చిన చెల్లిని ఒక దరిచేర్చాలని అతని ఆలోచన.

"సత్యం" అని కేకవేశాడు ప్యూన్.

"వస్తున్నానండి" అంటూ లేచి ఇంటర్వ్యూ రూమ్‌లో ప్రవేశించి "గుడ్‌మార్నింగ్ ఆల్ ఆఫ్ యూ" అన్నాడు సత్యం. కూర్చోమని సంజ్ఞ చేశారు ఇంటర్వ్యూ అధికారులలో ఒకరు. ఆ తరువాత ఒక్కొక్కరు ఒకో ప్రశ్న వేశారు. వాటన్నింటికి జవాబులు చెప్పాడు.

"ఓ.కే." నువ్వు వెళ్ళొచ్చు అన్నారు. అలాగే మిగతా వాళ్ళందరిని ఇంటర్వ్యూ చేశారు.

ఇంటిదారి పట్టిన సత్యాన్ని 'హలో... సత్యం... ఏరా? ఎన్నాళ్ళకి నీ దర్శన భాగ్యం" అంటూ చిరకాల మిత్రుడొకడు పలకరించాడు. "అరె... నువ్వా" అంటూ దురాలోచనరావును కౌగిలించుకున్నాడు సత్యం. ఒకరికొకరు చిన్ననాటి సంగతులు నెమరు వేసుకున్నారు.

"ప్రస్తుతం ఏం చేస్తున్నావు"

"ఇంటర్ పోయిందిగా — తరువాత హైదరాబాద్ వెళ్ళాను — అక్కడ నీళ్ళు పడక తిరిగి వచ్చాను. ఖాళీగా ఎందుకని ఈ ఇంటర్వ్యూ కొచ్చాను" అన్నాడు దురాలోచనరావు.

"నేను దానికే వచ్చాను— ఇంటర్వ్యూ అయింది" అన్న సత్యంతో ఇలా అన్నాడు దురాలోచన రావు" మనకేం వస్తాయిరా ఉద్యోగాలు — అటెండరు పోస్ట్‌కు కూడా చీఫ్ మినిష్టరు రికమండేషన్ చేస్తున్న ఈ రోజులలో... అందుకని నాకో ఆలోచన వచ్చింది. నా పరిస్థితి బాగోలేదు మనల్ని ఇంటర్వ్యూ చేసిన ఆఫీసరు మీ కులం వాడేరా. వాడింటికెళ్ళి మాటల సందర్భంగా నువు వాడి కులమేనని తెలిసేలా మాట్లాడు... కులమంటే పడి చస్తాడులే... తప్పకుండా నీకే ఇస్తాడు.

"నిజమేనంటావా?"

"అక్షరాలా... జస్ట్ ట్రై చేయి'..." దురాలోచన రావు అన్నాడు.

సత్యం దురాలోచనరావు ఆలోచనను పాటిస్తూ ఇంటర్వ్యూ అధికారిని ఇంటి దగ్గర కలిశాడు. ఆయనతో కటుంబ విషయాలు, తల్లి, చెల్లెలు బాధ్యతలు వివరించాడు. ఆయన ఓ.కే. సరేనని మాటిచ్చాడు సత్యానికి.

సంతోషంతో సత్యం పరవశించి పోయాడు.

దురాలోచనరావు నొక్కిన కాలింగ్ బెల్ మోత విని ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి.

"నమస్కారం సార్"

"ఎవరు నువ్వు?" ఎదురు ప్రశ్న.

"నేను మీ ఇంటర్వ్యూకొచ్చిన అభ్యర్థిని."

"ఇంటికెందుకొచ్చావు?"

"మీరు ఆ పోస్టు సరైన అభ్యర్థికివ్వకుండా — మీ కులపోడికి ఇస్తున్నట్టు వార్త అందింది."

"అట్లాంటిదేమిలేదు, జరగదు" ఇంటర్వ్యూ అధికారి అన్నాడు.

"జరిగితే మాత్రం పేపర్లో - పెద్ద అక్షరాలతో మొదటి పేజీలో" అంటూ బెదిరిస్తూ వెళ్ళాడు దురాలోచనరావు. తనకు ఉద్యోగం వస్తుందని తల్లితో, చెల్లితో చెప్పి ఆనందంలో మునిగితేలిన సత్యానికి మరుసటి రోజున ఆ ఉద్యోగం తనకు కాకుండా పోయిందని తెలిసికొని కుంగిపోయాడు. చివరకు నిజం తెలుసుకుంటే — దురాలోచన రావు దుర్బుద్ధితో ఇంటర్వ్యూ ఆఫీసర్ని కుల ఫీలింగ్ చూపిస్తున్నావని బెదిరించాడు...... వాడికి భయపడి వాడికే ఆ పోస్టు ఇచ్చాడంట.

స్నేహితుడా! నీకో నమస్కారం అని మనస్సులో అనుకున్నాడు సత్యం.

—మాదాసు నాగేశ్వరరావు

---

## మినీకథ ప్రేమలేఖ

ఉదయం పది గంటలు...

భ్రమర తన గదిలో కూర్చుని తీరికగా పత్రిక తిరగేస్తోంది! పోస్ట్ అంటూ కేక పెట్టి వరండాలోకి ఒక కవరు విసిరి కంగారుగా వెళ్ళిపోయాడు పోస్ట్‌మాన్! భ్రమర గబగబా వెళ్ళి ఆ కవరు తీసుకుంది.. అది తన పేరునే వచ్చింది.. భ్రమర ఆత్రంగా కవరు విప్పి చదివింది. అంతే.. ఆమె ముఖం ముకుళించుకు పోయింది.. ముక్కుపుటా లదిరాయి.. ఉక్రోషం తన్నుకు వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి..!

"డియర్ భ్రమరా!"

"మై స్వీట్ హార్ట్! నిన్ను ఒక్కపూట కూడా చూడకుండా ఉండలేకపోతున్నాను.. కాలేజీకి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు మాత్రమే దర్శనమిస్తున్నావు. అప్పుడు కూడా నీ వెంట ఎవరో స్నేహితురాళ్ళు ఉంటూనే ఉన్నారు. నువ్వు నా వైపు చూడకపోయినా ఎప్పుడూ నిన్ను నేను వెంటాడుతూనే ఉంటాను. ఎప్పుడో నువ్వు నాకు ఒంటరిగా దొరుకుతావు.. అప్పుడు నిన్నేంచేస్తానో తెలుసా? ఊహూ ఇప్పుడు చెప్పను..." ఇంకా ఏవేవో పిచ్చిగా వ్రాశాడు. ముద్దులతో ముగించాడు.. పేరు రాఘవ(ట) భ్రమరకు మతిపోయినంత పనయింది.. తను అసలు రోడ్డు మీద - ఎవరి వంకా చూడదు.. తల వంచుకునే నడుస్తుంది.. ఈ రాఘవ ఎవరో తనకు తెలియకుండా అనుసరిస్తున్నాడన్న మాట! ఎలా? ఏం చేయాలిప్పుడు?

"ఏంటమ్మా? ఎవరి దగ్గర్నుంచి ఉత్తరం?" లోపలి గదిలోంచి భ్రమర తాతగారు వరండాలోకి వస్తూ మనవరాలిని పలకరించారు. భ్రమర జవాబు చెప్పలేదు. దుఃఖం ఉబికి ఉబికి వస్తోంటే బొమ్మలా అలాగే నిలబడిపోయింది. తాతగారు.. మనవరాలి చేతిలోంచి ఉత్తరం అందుకున్నారు.. ఆయన ముఖమూ మారి పోయింది.

"నాకు తెలుసమ్మా! ఈ ప్రేమలేఖ రాసిన రాస్కెల్ ఎవరో.. ఉండు చెబుతాను..." ఆయన ఇంట్లో వాళ్ళందరినీ వరండాలోకి పిలిచారు. అందరూ వరండాలో గుమి గూడారు.

"ఆ వెధవ రాస్కెల్‌ని నేనే నమ్మా! ఎప్పుడో వయసులో వున్నపుడు నేను మీ అమ్మమ్మ భ్రమరాంబకు రాసిన ప్రేమలేఖ యిది.. పోస్టల్ వారి పనితనం, గొప్పతనం వల్ల ఇదిగో.. ఇప్పుడు నిన్నిలా చేరింది..!" మనవరాలు భ్రమరతో, తాతయ్య రాఘవరావు భళ్ళుమని నవ్వుతూ చెబుతూంటే ఇంట్లో వాళ్ళందరూ ముక్కున వేలేసుకున్నారు. భ్రమర సరేసరి.. ఆ అమ్మాయికి నోట మాట రాలేదు.

—శ్రీకంఠమూర్తి